సాక్షి
కాకినాడ
గురువారం | 11 | జూలై | 2024



## రండి.. రెండడుగులు వేయండి

ఆరోగ్యం కోసం ప్రతి రోజూ నడవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఖర్చు లేని వ్యాయామం కావడంతో జనం కూడా వాకింగ్‌కు మొగ్గు చూపుతున్నారు.


8లో



## కాకినాడలో కలకలం

కాకినాడలో బుధవారం జరిగిన ఓ సంఘటన కలకలం రేపింది. ఓ యువకుడు నేరుగా గాయాలతో కోర్టుకు వచ్చి న్యాయమూర్తిని ఆశ్రయించాడు.

## 52,546 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 52,546 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.65 అడుగులకు నీటి మట్టం చేరింది. బ్యారేజీలోని మొత్తం 175 గేట్లకు గానూ 85గేట్లను పైకి లేపి మిగులు జలాలను విడుదల చేస్తున్నారు.

## న్యూస్‌రీల్

### పుష్కరలో పూడిక తీత పనులు

నాలుగైదు రోజుల్లో సాగునీరు



విలేకర్లతో మాట్లాడుతున్న ఈఈ గోవిందు

తుని రూరల్: పుష్కర ప్రధాన కాలువ నుంచి తుని మండలానికి రెండు రోజుల్లో సాగునీరు చేరుతుందని పుష్కర ఎత్తిపోతల పథకం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గోవిందు అన్నారు. బుధవారం తుని మండలం టి.తిమ్మాపురం వద్ద పుష్కర కాలువలో పూడికతీత పనులను కొబ్బరి కాయకొట్టి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ 2.2 కిలో మీటర్ల పొడవునా పూడిక తొలగింపు పనులు చేపట్టామన్నారు. పుష్కర కాలువ పెండింగ్ పనులకు రూ.ఆరు కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. పుష్కర కాలువలో ఇప్పటికే 93.6 కిలోమీటర్ల వద్దకు సాగునీరు చేరిందన్నారు. తుని నియోజకవర్గంలో ఈ సంవత్సరం ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, తాండవ సుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు, లోవ ఆలయ మాజీ చైర్మన్ కరపా అప్పారావు పాల్గొన్నారు.

### గుడి కోసం కూటమిలో కుమ్ములాటలు



ఆలయం వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నేతలు

పిఠాపురం: ఆలయంలో పెత్తనం కోసం కూటమిలో కుమ్ములాటలు కొనసాగుతున్నాయి. గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయం తమది అంటే తమదని టీడీపీ, జనసేన నేతలు పంతాలకు పోయి వివాదాస్పదంగా మార్చేశారు. గతంతో గుడి తాళాలు ఇచ్చే విషయంలో ఇరు పార్టీల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో అప్పట్లో పోలీసులు గుడి తాళాలను అధికారుల వద్ద ఉంచారు. ఇరువర్గాల మధ్య వివాదం సద్దుమణిగాక ఇవ్వాలని నిర్ణయించారు. అయితే బుధవారం గుడి తాళాలను జనసేన నాయకులకు అధికారులు ఇచ్చేయడంతో టీడీపీ నేతలు ఆందోళన చేపట్టారు. తమ ప్రమేయం లేకుండా కేవలం జనసేన నేతలకు తాళాలు ఇవ్వడమేమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. ఆలయం వద్ద నిరసనకు దిగారు. పొత్తు ధర్మం పాటించకుండా జనసేన ఏకపక్షంగా వ్యవహరిస్తోందని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. జనసేన నెగ్గిన చోట టీడీపీ పెత్తనం ఏమిటంటూ జనసేన నేతలు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో అపర్ణాదేవి ఆలయ పెత్తనం విషయం మళ్లీ వివాదాస్పదంగా మారింది.

# గుట్టకాయస్వాహా!

- ఉచితం అంటూనే ఇసుక పక్కదారి
- ఉప్పలంకలో అడ్డగోలుగా దోపిడీ
- ఆగమేఘాలపై నిల్వలు ఖాళీ
- రూ.4.80 కోట్లు పంచుకున్న తమ్ముళ్లు



కత్తిపూడి-దిగమర్రు జాతీయ రహదారిలో ఉప్పలంక నుంచి ఇసుక తరలిస్తున్న దృశ్యం( ఫైల్)


సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధికారం చేతికి రాగానే తెలుగు తమ్ముళ్లు అడ్డగోలు దోపిడీలకు తెగబడ్డారు. ఇసుక ఉచితంగా సరఫరా చేస్తామని చెప్పి అసలు ఇసుక లేకుండా కొల్లగొట్టేశారు. గత ప్రభుత్వంలో గృహనిర్మాణ శాఖ ద్వారా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారుల కోసమని నిల్వచేసిన టన్నుల కొద్దీ ఇసుక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు కూడబలుక్కుని కొట్టేశారు. ఎలాగూ ఉచిత ఇసుక విధానం అమలులోకి రానుందనే ముందుచూపుతో కాకినాడ జిల్లా ఉప్పలంక వద్ద నిల్వ ఉన్న ఇసుకను తెగనమ్మేసి రూ.కోట్లు వెనకేసుకున్నారు. కాకినాడ జిల్లా కేంద్రం పరిసర ప్రాంతాలకు చెందిన ఇద్దరు ప్రముఖుల మధ్య రూ.కోటిన్నర చేతులు మారింది. ఆ ఇద్దరు ప్రముఖ నేతల మౌఖిక ఆదేశాలతో రెవెన్యూ, పోలీసు శాఖలు చేష్టలుడిగి చూడక తప్పింది కాదు. ఈ ఇసుక వ్యవహారంలో తెలుగుదేశంలో ఒక ముఖ్య నేత చక్రం తిప్పి అంతా తానై చక్కబెట్టినట్టుగా ఆ పార్టీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు.

**పక్కా ప్లాన్‌తో మెక్కేశారు**

కత్తిపూడి–దిగమర్రు జాతీయ రహదారికి ఆనుకుని కాకినాడ జిల్లా కరప మండలం ఉప్పలంక వద్ద గత ప్రభుత్వంలో గృహనిర్మాణ లబ్ధిదారుల కోసం సుమారు 70 వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను అందుబాటులో ఉంచారు. అప్పట్లో ఇళ్ల లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం ఇసుకను సరఫరా చేసేవారు. జాతీయ రహదారి మీదుగా వెళ్లేవారికి ఆ ఇసుక గుట్టలు కొండలను తలపించేవి. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అధికార పార్టీ నేతల కన్ను కొండలను తలపించే రీతిలో ఉన్న ఆ ఇసుక గుట్టలపై పడింది. ఆ ఇసుక గుట్టలు కూడా జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో రవాణాకు అనువైనదిగా భావించి చక్కబెట్టేశారంటున్నారు. అందరూ కూడబలుక్కుని ఇసుక తరలించి ఇతర ప్రాంతాలకు అమ్మేసేలా పక్కాగా ప్లాన్ చేశారు. ఈ ఇసుక దందా వ్యవహారాన్ని గుట్టుచప్పుడు కాకుండా చక్కబెట్టే బాధ్యతలను కాకినాడ సిటీలో అధికార పార్టీకి చెందిన ఒక కీలక నేత భుజాన వేసుకున్నారు. అనుకున్నదే తడవుగా కాకినాడ పరిసర ప్రాంతాలకు చెందిన ఇద్దరు కూటమి నేతలతో మంతనాలు జరిపారు. నాడు కుదిరిన ఒప్పందం మేరకు ఇసుక తరలింపు సగం పూర్తి అయ్యేసరికి చెరో రూ.65 లక్షలు చేతిలో పెట్టారని విశ్వసనీయ సమాచారం. అంటే రూ.1.30 కోట్లు తొలి విడతగా ఇద్దరు నేతల జేబుల్లోకి వెళ్లింది. మరో ముఖ్య నేత, అతని ప్రధాన అనుయాయుడికి రూ.కోటి ముట్టచెప్పారని చెబుతున్నారు. మరో రూ.రెండున్నర కోట్లు ఈ బాధ్యతనంతటినీ భుజాన వేసుకున్న నిర్వాహకులు తలో వాటా వేసుకున్నారని సమాచారం. టీడీపీ అధికారంలోకి వచ్చి పట్టుమని పది రోజులు కూడా గడవకుండానే ఉప్పలంక ఇసుక పాయింట్‌లో ఈ వ్యవహారాన్ని గుట్టు చప్పుడు కాకుండా చక్కబెట్టేశారు. కోనసీమ ప్రాంతానికి చెందిన కూటమి నాయకుడి కనుసన్నల్లోనే ఇసుక దందా నడిచిందని సమాచారం. కోనసీమ, రామచంద్రపురం, కాకినాడ ప్రాంతాలకు చెందిన టిప్పర్ల యజమానులతో మాట్లాడి ఏక కాలంలో 50 టిప్పర్లు పెట్టి వారం తిరగకుండానే ఆగమేఘాలపై ఇసుకను ఖాళీ చేసేశారని స్థానికులు చెబుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా మొత్తం ఇసుకను రాజమహేంద్రవరం, కాకినాడ, మండపేట, రామచంద్రపురం ప్రాంతాలలో బిల్డర్‌లకు అమ్మేసి రూ.కోట్లు కొల్లగొట్టారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టపగలు కళ్లెదుటే ఈ దందా జరుగుతున్నా తెర వెనుక పెద్ద తలకాయలకు భయపడి పోలీసు, రెవెన్యూ అధికారులు ఎవరూ అటు వైపు కన్నెత్తి చూడలేదంటున్నారు. ఈ విషయమై అధికారులు ఎవరూ స్పందించడం లేదు.



ఉప్పలంక నుంచి టిప్పర్లలో తరలిస్తున్న ఇసుక



పెద్దాపురం వాలుతిమ్మాపురంలో స్టాక్ పాయింట్ వద్ద ఇసుక

**చార్జీల పేరుతో బాదుడు**

ఇదిలా ఉండగా...అధికారికంగా స్టాక్ పాయింట్ ఉన్న పెద్దాపురంలో ప్రభుత్వం చెబుతున్నట్టుగా ఉచిత ఇసుక అనేది ఒక ఫార్సుగా కనిపిస్తోంది. టీడీపీ ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందచేస్తుందని ఆశలు చూపించి చివరకు చార్జీల పేరుతో బాదుడు మొదలు పెట్టిందంటున్నారు. స్టాక్ పాయింట్ నుంచి తీసుకువెళ్లే వినియోగదారులు చార్జీల రూపంలో రూ.వేలకు వేలు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం వాలుతిమ్మాపురం రోడ్డులో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో టన్ను ఇసుక రూ.655గా నిర్ణయించారు. ఐదు యూనిట్ల లారీ (20 టన్నుల) ఇసుకకు రూ.13,100 ఇక్కడ చెల్లించాల్సి వస్తోంది. ఇందుకుతోడు ఈ స్టాక్ పాయింట్ నుంచి రవాణా ఖర్చులు కిలో మీటరుకు రూ.4.90 అదనం. పెద్దాపురం పరిధిలో పెద్దగా చార్జీల భారం పడటం లేదు. కానీ, పెద్దాపురం దాటి బయటకు తీసుకువెళ్లాలంటే లారీ ఇసుకకు సరాసరిన రూ.15వేలు వెచ్చించాల్సి వస్తోందంటున్నారు. ఇసుక ఉచితం అంటున్న ప్రభుత్వం పెద్దాపురం స్టాక్ పాయింట్ వద్దకు చేరే సరికి రవాణా ఖర్చుల పేరుతో టన్ను రూ.655కు విక్రయించడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, అధికారపార్టీకి చెందిన కొందరు నేతలు మాత్రం స్టాక్ పాయింట్ నుంచి బినామీ పేర్లతో ఇసుక నిల్వలు సొమ్ము చేసుకుంటున్నారు. పెద్దాపురం స్టాక్ పాయింట్ వద్ద నూతన ఇసుక విధానం వచ్చాక ప్రారంభ నిల్వగా గత ప్రభుత్వ హయాంలో ఉన్న 1,19,293 యూనిట్ల ఇసుకను చూపించారు. కొత్త ఇసుక విధానం ద్వారా గడచిన రెండు రోజులుగా పెద్దాపురం స్టాక్ పాయింట్ నుంచి సుమారు 2,732 టన్నుల ఇసుక విక్రయించినట్టు లెక్కలు చెబుతున్నాయి.

## కమాండ్ కంట్రోల్ రూమ్ పునరుద్ధరణకు చర్యలు


కలెక్టర్ షాన్ మోహన్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (కేఎస్‌సీసీఎల్) ద్వారా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, కేఎస్‌సీసీఎల్ చైర్‌పర్సన్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కేఎస్‌సీసీఎల్ 43వ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో ఆయన కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్, కేఎస్‌సీసీఎల్ సీఈవో, ఎండీ జె.వెంకటరావుతో కలిసి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పనులపై సమీక్షించిన సందర్భంగా మాట్లాడారు. కేఎస్‌సీసీఎల్ ద్వారా చేపట్టిన పనుల పురోగతి, ఇంతకుముందు డైరెక్టర్ల బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించారు. సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా స్మార్ట్ సిటీ మిషన్ ప్రాజెక్టు కింద ఇప్పటి వరకూ పూర్తయిన పనుల వివరాలు, ప్రస్తుతం జరుగుతున్న పనుల ప్రగతిపై చర్చించారు. కాకినాడను ఆకర్షణీయ నగరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌కు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.194.42 కోట్లు రావలసి ఉందన్నారు. కేఎస్‌సీసీఎల్ ప్రాజెక్టు కింద వివేకానంద పార్కు వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా 40 టీపీడీ కెపాసిటీ బయో–మెథనేషన్ ప్లాంట్(వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్) నిర్మాణం, సరఫరా, ఇన్‌స్టాలేషన్, స్థలాన్ని చొల్లంగి నుంచి దుమ్ములపేటకు మార్చడం వంటి అంశాలపై పూర్తి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.వెంకటరావు, కేఎస్‌సీసీఎల్ డైరెక్టర్, జేఎన్టీయూ ప్రొఫెసర్ జేవీఆర్ మూర్తి, స్వతంత్ర డైరెక్టర్ టీవీఎస్ కృష్ణకుమార్, కంపెనీ సెక్రటరీ ఎం.ప్రసన్నకుమార్, ఈఎన్సీ పబ్లిక్ హెల్త్ అధికారి ఆనందరావు పాల్గొన్నారు.

## 88 అడుగులకు చేరిన పంపా నీటిమట్టం



స్వల్పంగా వచ్చిన నీటి నిల్వలతో పంపా రిజర్వాయర్

అన్నవరం: స్థానిక పంపా రిజర్వాయర్ నీటి మట్టం స్వల్పంగా పెరిగి బుధవారం సాయంత్రానికి 88 అడుగులకు చేరుకుంది. ఇటీవల పంపా రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురియడంతో రిజర్వాయర్‌లోకి నీరు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 105 అడుగులు కాగా 103 అడుగులకు నీటిమట్టం చేరగానే ఎగువనున్న పుష్కర కాల్వలోకి పంపా బ్యాక్ వాటర్ చేరుతుంది. దీంతో 103 అడుగులు దాటి నీటిమట్టం చేరగానే బ్యారేజీ గేట్లు ఎత్తి నీటిని సముద్రానికి విడుదల చేస్తారు. పంపా గరిష్ఠ నీటి నిల్వ 0.43 టీఎంసీలు. ప్రస్తుతం 0.057 టిఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. అంటే గరిష్ఠ నీటి నిల్వలో 12 శాతం మాత్రమే ప్రస్తుతం నీరు నిల్వ ఉంది.

రిజర్వాయర్ కింద సాగవుతున్న 12 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేయాలంటే కనీసం 92 అడుగుల నీటి మట్టం ఉండాలి. కాని గత వారం రోజులుగా దట్టంగా మబ్బులు కమ్ముకుని ఉరుములు, మెరుపులు మినహా పెద్దగా వర్షం కురవడం లేదు. ఈ నెలాఖరు వరకు ఇదే పరిస్థితి కొనసాగితే ఖరీఫ్ సాగుపై ఆశలు వదులుకోవల్సిందేనని రైతులు అభిప్రాయపడుతున్నారు.

## సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

**రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ జులై 31, 2024**

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.





సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.





సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు | రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

## టిడ్కో వివరాలు అందజేయండి

కాకినాడ సిటీ: జిల్లాలో టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకుల వారీగా మంజూరు చేసిన రుణాలు, రికవరీలకు సంబంధించిన వివరాలు అందజేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో టిడ్కో గృహాల పురోగతిపై టిడ్కో, మెప్మా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మంజూరైన టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్, లబ్ధిదారులకు అప్పగించిన గృహాలు, బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు మంజూరు చేసిన రుణాలు, వాటి రికవరీల వివరాలపై అధికారులతో చర్చించారు. జిల్లాలో 7,288 టిడ్కో గృహాలకు 6,384 గృహాలు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభించామన్నారు. ఇందులో 3,386 గృహాలు రిజిస్ట్రేషన్, తనఖా ప్రక్రియను పూర్తి చేసి ఆయా మున్సిపాలిటీ లబ్ధిదారులకు అందజేసినట్లు కలెక్టర్ వివరించారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ప్రధానంగా జిల్లాలో టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకుల వారీగా మంజూరు చేసిన రుణాలు, రికవరీలకు సంబంధించిన వివరాలు సేకరించి నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ బి.శ్రీనివాసరావు, ఈఈ రీటా, మెప్మా పీడీ బి ప్రియంవద పాల్గొన్నారు.

## 'ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్' హెల్ప్ డెస్క్ ఏర్పాటు

కాకినాడ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ సంయుక్త ఆదేశాల మేరకు కాకినాడలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంహెచ్‌వో) కార్యాలయంలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెల్ప్ డెస్క్ ద్వారా పెన్షన్‌కు సంబంధించిన వివిధ సమస్యల పరిష్కారంతోపాటు ఇతర వివరాలను పొందవచ్చన్నారు. హెల్ప్ డెస్క్ సేవలు పొందేందుకు 79816 04598 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. ఈ సేవలు అందించేందుకు డీఈవో కె.ప్రభావతిని నియమించామన్నారు.

## క్లుప్తంగా

### బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత



తునిలో బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న రైల్వే పోలీసులు

**తుని:** రైలు ప్రయాణంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను తిరిగి బాధితులకు రైల్వే పోలీసులు బుధవారం అప్పగించారు. స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ కథనం ప్రకారం.. గతంలో 8 మంది ప్రయాణికులు రైలు ప్రయాణం చేస్తూ యలమంచిలి, నర్సీపట్నం, తుని, అన్నవరం ప్లాట్‌ఫామ్‌లపై సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. దీనిపై తుని రైల్వే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రైల్వే పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్లను కనుగొన్నారు. రూ.రెండు లక్షల విలువ చేసే సెల్‌ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అందజేశారు.

**సెల్‌ఫోన్ల రికవరీ**

**కాకినాడ క్రైం:** రైళ్లలో తమ ఫోన్లను పోగొట్టుకున్న ప్రయాణికులకు కాకినాడ రైల్వే ఎస్‌ఐ రవికుమార్ బృందం సాంత్వననిచ్చింది. రూ.3 లక్షల విలువ చేసే 12 సెల్‌ఫోన్లను బుధవారం తిరిగి ప్రయాణికులకు అప్పగించారు. కాకినాడ జీఆర్‌పీ స్టేషన్‌లో తమ ఫోన్లు అందుకున్న బాధితులు ఆనందరం వ్యక్తం చేశారు. సంబంధిత వివరాలను ఎస్‌ఐ ఎస్.రవికుమార్ వెల్లడించారు. కొద్ది నెలలుగా నమోదైన ఫిర్యాదుల ఆధారంగా విజయవాడ ఎస్‌ఆర్‌పీ రాహుల్ దేవ్‌సింగ్ ఆదేశాల మేరకు, డీఎస్పీ ఎల్.మోహన్‌రావు, కాకినాడ లైన్స్ ఇన్‌స్పెక్టర్ గొస్ బాగీ పర్యవేక్షణలో సెర్చ్ జరిగిందన్నారు. పోయిన సెల్‌ఫోన్లను గుర్తించేందుకు సీఈఐఆర్ సాంకేతికతను వినియోగించామన్నారు. కానిస్టేబుల్ జగదీష్ రెడ్డి, బృందం తీవ్రంగా శ్రమించిందని పేర్కొన్న ఎస్‌ఐ వారిని అభినందించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**సీతానగరం:** సీతానగరానికి చెందిన బేదంపూడి జగన్నాథం (61) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈ నెల 2న డయేరియా లక్షణాలతో సీతానగరం బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న ఓ నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందగా.. వాంతులు, విరేచనాలు తగ్గాయి. తర్వాత 5న రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మరునాడు వేరే హాస్పిటల్‌కు తరలించగా అక్కడ డయాలసిస్ చేశారు. 9న కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి జగన్నాథం మరణించాడు. కాకినాడ ఆసుపత్రి నుంచి రెండు రోజుల్లో రిపోర్టులు వస్తాయని, వాటిని పరిశీలించి ఏ వ్యాధితో మృతి చెందారో వెల్లడిస్తామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకె చైతన్య తెలిపారు

# రండి.. రెండడుగులు వేయండి

- వాకింగ్‌కు అధికమైన ప్రాధాన్యం
- ప్రజల్లో ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ
- ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్ల సందడి



రాయవరం ఉన్నత పాఠశాలలో వాకింగ్ చేస్తున్న వాకర్లు

**రాయవరం:** కాలం మారింది.. ఆధునీకత కొత్త పుంతలు తొక్కుతోంది.. నడిచే కాలం పోయింది.. ఏ చిన్న పనైనా బైక్‌పై వెళ్లే రోజులు వచ్చాయి. నడక లేక మానవాళిని అనేక ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. మానసిక ఆందోళన, ఒత్తిడి వంటి పరిస్థితులు కుంగదీస్తుండగా, మారుతున్న జీవనశైలి కారణంగా అనేక మంది ఊబకాయం, షుగర్, బీపీ తదితర దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్నారు. వీటన్నింటినీ సమర్థంగా ఎదుర్కొనేందుకు నడక చక్కని ఆరోగ్య సూత్రమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కేవలం మందులతోనే సరిపెట్టుకోకుండా క్రమం తప్పకుండా వాకింగ్ అలవాటు చేసుకుంటే మెరుగైన ఆరోగ్యం సొంతమవుతుందని సూచిస్తున్నారు.

**ఏ వయసు వారికైనా..**

చిన్నపాటి సుస్తి చేసి వైద్యుని వద్దకు వెళ్తే రెండడుగులు వేయండి.. ఆరోగ్యం బాగుంటుందని చెబుతున్నారు. అంతేకాకుండా మరణ మృదంగం వాయించిన కరోనా మహమ్మారి సైతం ఆరోగ్యం పట్ల హెచ్చరికలు జారీ చేసి వెళ్లింది. దీంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ వారి పరిమితిని బట్టి నడిచేస్తున్నారు. వయసుకు సరిపడా అడుగులు వేస్తూ.. జాగింగ్ చేస్తున్న వాకర్స్ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం నడక.. నడకపై ఏర్పడిన అవగాహనతో ప్రజలు దినకరుడు రాక ముందే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పట్టణాలు, నగరాల్లో క్రీడా ప్రాంగణాలు, ఖాళీ మైదానాలతో పాటు, గ్రామాల్లో అయితే ఊరి పొలిమేర వరకూ చకచకా నడిచేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం నడక కారణంగా సూర్యరశ్మి శరీరానికి తగిలి ఎముకల్లో కాల్షియం లోపాలను అధిగమించవచ్చని వైద్యులు చెబుతుండడంతో అధికశాతం ఉదయాన్నే నడుస్తుండగా, ఉదయం కుదరని వారు మాత్రం సాయంత్రం నుంచి నడక బాట పడుతున్నారు. వాకింగ్ అనంతరం వ్యాయామాలు, యోగా చేస్తున్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వంటి వ్యాధిగ్రస్తులకు ఈ నడక ఎంతో మేలు చేస్తుంది.

**ప్రయోజనాలు ఎన్నో..**

- క్రమం తప్పకుండా నడవడం వల్ల ఎండార్ఫిన్ హార్మోన్లు విడుదలై మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.
- ఒత్తిడి, ఆందోళన, కంగారు సమస్యలను అధిగమించవచ్చు.
- గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ సక్రమంగా జరిగి సమర్థవంతంగా పని చేస్తాయి. గుండె సంబంధిత జబ్బులు, పక్షవాతం వంటివి దరి చేరవు.
- అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి రోగాలను నియంత్రిస్తుంది.
- కీళ్లు, కండరాలు సాగుతూ శక్తి పెరిగి నడిచేందుకు సమతుల్యత తీసుకువస్తుంది.
- శరీరంలోని అధిక కొవ్వు శాతాన్ని తగ్గిస్తుంది. శరీరానికి మంచి శ్వాస, అధిక స్థాయిలో ఆక్సిజన్ తీసుకునేలా చేస్తుంది.
- మోకాలు, చీలమండలు మృదువుగా మారి అనుకూలంగా ఉంటాయి. ఎముకలు దృఢంగా తయారవుతాయి.
- విటమిన్'డి' లోపంఉండదు. క్యాన్సర్ రిస్క్‌ను తగ్గిస్తుంది. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
- ముఖ్యంగా 30 ఏళ్లు దాటిన వారంతా నడకను దినచర్యగా చేసుకుంటే మంచిది.

**ఖర్చు లేని వ్యాయామం**



ప్రతి ఒక్కరూ వాకింగ్‌కు కొంత సమయాన్ని కేటాయించాలి. ఎటువంటి ఖర్చు లేని చక్కని వ్యాయామం ఇది. ఎక్కడైనా, ఏ సమయంలోనైనా వాకింగ్ చేయవచ్చు. అయితే ఉదయం పూట వాకింగ్ ఉత్తమం. నడక వల్ల గుండె వ్యాధుల ముప్పు తగ్గుతుంది. రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది.

–డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి, రాయవరం

**జీవనశైలిలో భాగం కావాలి**



నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో వాకింగ్, జాగింగ్ ఒక భాగం చేసుకోవాలి. నిత్యం నడక అలవాటున్న వారికి అనారోగ్యాలు దరిచేరవు. మంచి ఆరోగ్యానికి నడకను ఒక పరిష్కారంగా చెప్పుకోవచ్చు. గత కొన్నేళ్లుగా నడక చేస్తూ ఎంతో ఆరోగ్యంగా ఉన్నాను.

–పడాల వేణుసుధాకరరెడ్డి, ఫ్యాక్టరీ యజమాని, రాయవరం

**వాకింగ్‌తో ఉల్లాసం**



వాకింగ్ చేస్తుంటే ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. మానసిక ఒత్తిడి అధికమవుతున్న నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ ఇది అలవాటు చేసుకోవాలి. తద్వారా బీపీ, షుగర్ వంటి వ్యాధులు రావు. అవి ఉన్నవారిలో వ్యాధులు నియంత్రణలోనే ఉంటాయి. వాకింగ్ చేయకుంటే అనారోగ్యాలు దరి చేరతాయి.

–సత్తి వెంకటసుబ్బారెడ్డి, వ్యాపారి, రాయవరం

**ఒత్తిడి తగ్గుతుంది**



నడక కేవలం శరీర దారుఢ్యాన్ని పెంచడమే కాకుండా, మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. ప్రతి రోజు వాకింగ్ చేయడంతో క్రమశిక్షణ అలవడుతుంది. ప్రతి రోజూ 30 నిమిషాల పాటు నడవడం ప్రయోజకరంగా ఉంటుంది.

–మల్లిడి దొరారెడ్డి, విశ్రాంత హిందీ లెక్చరర్, రాయవరం

### అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

**కె.గంగవరం:** ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, కె.గంగవరం పోలీసుల కథనం ప్రకారం.. కోటిపల్లికి చెందిన అంగాడి సత్తిబాబు (36) కూలి పనులు చేస్తూ భార్యతో కలసి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల భార్య ఇదే గ్రామంలో ఉన్న పుట్టింకి వెళ్లింది. బుధవారం ఉదయం ఇంటి తలుపు తీయకపోవడంతో చూసిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి ఇంటి తలుపులు తెరిచి చూడగా సత్తిబాబు అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడు. దీంతో మృతుడి అక్క రామలక్ష్మి పోలీసులకు సమాచారం అందించి రాత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జానీ బాషా తెలిపారు.

### ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



వెంకట రామకృష్ణ

**చాగల్లు:** భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపంతో ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై పి.నాగరాజు కథనం ప్రకారం.. చాగల్లులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన దొంగా వెంకట రామకృష్ణ (37) కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. రెండేళ్లుగా భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురై ఇంట్లో బుధవారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని తండ్రి బుల్లియ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## సహారాలో డిపాజిట్ కట్టి మోసపోయాం

**న్యాయం చేయాలని బాధితుల డిమాండ్**



డిపాజిట్ బాండ్‌లను మీడియాకు చూపిస్తున్న బాధితులు

**మండపేట:** సహారా సంస్థలో రూ.లక్షల డిపాజిట్లు కట్టి మోసపోయామంటూ మండపేట మండలం ఏడిద గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలపరిమితి ముగిసినప్పటికీ తమ సొమ్ము తిరిగి ఇవ్వడం లేదని వాపోయారు. డిపాజిట్ సొమ్ము ఇప్పించాలని కోరుతూ వారు మీడియాను ఆశ్రయించారు. బుధవారం ఏడిదలో బాధితులు మాట్లాడుతూ, తమ గ్రామంలో సుమారు 150 నుంచి 200 మంది సహారా డిపాజిట్లు చేశామన్నారు. తామంతా కూలి నాలి చేసుకుని కూడబెట్టిన సొమ్మును వేశామన్నారు. తమ బాధను వినేందుకు జిల్లాలో ఎక్కడా సహారా కేంద్రాలు తెరచి ఉండడం లేదన్నారు. సమాధానం చెప్పే నాథుడు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామ పెద్దలు వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దీనిపై సహారా ఏజెంట్‌ను ప్రశ్నించగా సహారా డిపాజిట్లకు సంబంధించి కేసు సుప్రీం కోర్టులో నడుస్తున్నందున ఈ విషయం తన చేతిలో లేదని, డిపాజిటర్లతో పాటు తానూ రూ.12 లక్షలు నష్టపోయానని వివరించాడు. తన పరిధిలో సుమారు రూ.3 కోట్లపైబడి బకాయిలు తీర్చాల్సిన మాట వాస్తవమని, యాజమాన్యం ముందుకొస్తే తప్ప తానేమీ చేయలేనని, డిపాజిటర్ల ప్రయత్నానికి పూర్తి మద్దతు ఇస్తానని ఏజెంట్ తెలిపాడు. అనంతరం మరి కొంతమంది బాధితులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యవహారంపై దృష్టి పెట్టి తమ సొమ్ము ఇప్పించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రామిశెట్టి సత్యనారాయణ, బలుసు అన్నపూర్ణ, రామిశెట్టి రమాదేవి, కుక్కల వీరగోపాలుడు, తంగెళ్ల సత్యవతి, గాది వెంకటజోగయ్య, కుసుమంచి వెంకట సూర్యనారాయణ, వానపల్లి పల్లపురాజు తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవునికి జన్మ నక్షత్ర పూజలు



ఆయుష్య హోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

**అన్నవరం:** సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా రత్నగిరి సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల మూల విరాట్‌లకు బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆయుష్య హోమం వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున రెండు గంటలకు స్వామివారి ఆలయాన్ని తెరిచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సత్యదేవుడు, అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు పంచామృతాలతో మహన్యాస పూర్వక అభిషేకం జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లను స్వర్ణాభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ యాగశాలలో స్వామివారికి ఆయుష్య హోమం నిర్వహించారు. అనంతరం హోమగుండంలో ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి జరిపారు. వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠి, చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, యనమండ్ర శర్మ, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, అర్చకులు వెంకటేశ్వర్లు, బులుసు శర్మ, వ్రత పురోహితులు రవిశర్మ, పాలంకి పట్టాభి, కొంపెల్ల మూర్తి, ఇతర పండితులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

**భక్తజన కోలాహలం**

సత్యదేవుని ఆలయం బుధవారం భక్తజన కోలాహలంగా మారింది. సుమారు 25 వేల మంది భక్తులు దర్శించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు వెయ్యి నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో సుమారు నాలుగు వేల మందికి భోజన సౌకర్యం కల్పించారు.

**నేడు స్వామివారి నిజరూప దర్శనం**

ప్రతి రోజూ పట్టువస్త్రాలు, సుగంధ భరిత పుష్పాలంకరణలో దర్శనమిచ్చే సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరులు గురువారం సందర్భంగా కేవలం పుష్పాలంకరణతో శిలారూపంగా నిజరూప దర్శనంతో ప్రత్యక్షమివ్వనున్నారు. వారానికి ఒకసారి మాత్రమే ఈ విధంగా దర్శనం ఉండడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

## టీచ్ టూల్ అభ్యర్థులకు 18 నుంచి శిక్షణ

**డీఈఓ కమలకుమారి**

**అమలాపురం రూరల్:** టీచ్ టూల్ అభ్యర్థులకు ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకూ శిక్షణ ఇవ్వనున్నట్లు కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి తెలిపారు. పేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమెతో పాటు సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు బుధవారం పరిశీలించారు. శిక్షణకు అవసరమైన తరగతి గదులను వారు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పాఠశాల తరగతిని పరిశీలించి, బోధనా సామర్థ్యాలను అంచనా వేసేందుకు టీచ్ టూల్ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 423 మంది అభ్యర్థులకు నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఇందుకు అమలాపురం డివిజన్ పరిధిలో పేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, రామచంద్రపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శిక్షణ కేంద్రాలుగా ఎంపిక చేశామన్నారు.

**భోజనం రుచిగా ఉండాలి**

పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని డీఈఓ కమలకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. పేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె పరిశీలించారు. ఈ పథకంలో ఆహార పదార్థాలు రుచిగా ఉండేలా హెచ్ఎంలు పర్యవేక్షణ చేయాలన్నారు. 100 శాతం విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు వారానికి ఐదు రోజులు కోడిగుడ్లు, రోజు విడిచి రోజు చిక్కీ, రాగిజావ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం, అకడమిక్ మానిటరింగ్ అధికారి తదితరులు ఉన్నారు.



### నేటి నుంచి పాలిసెట్ తుది కౌన్సెలింగ్

**రాజమహేంద్రవరం రూరల్:** రాష్ట్రంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ పాలిసెట్–2024లో అర్హత పొంది డిప్లమో కోర్సుల్లో ప్రవేశం కోసం విద్యార్థులు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని బొమ్మూరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన, ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. 16న కళాశాలల్లో సీట్లు కేటాయిస్తామన్నారు. ఈ వివరాలను http//appolycet.nic.inలో పొందుపరిచామన్నారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ కళాశాలల్లో రిపోర్టు చేయాలన్నారు.

## నేటి నుంచి నాటిక పోటీలు




నాటిక పోటీల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న పరిషత్ ప్రధాన కార్యదర్శి దయానందబాబు

**బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ):** అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో గురువారం నుంచి 14 వరకూ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు జరుగుతాయని పరిషత్ ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు అన్నారు. ఈ మేరకు బుధవారం కాకినాడ సూర్యకళా మందిరంలో ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. గురువారం రాత్రి ఏడు గంటలకు అనకాపల్లి షిరిడీసాయి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ మలిసంధ్య నాటిక, అనంతరం శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆ సరసాల నాటిక, 12న రాత్రి ఎన్‌టీఆర్ జిల్లా వెలగలేరు రాత నాటిక, అనంతరం కత్రపాడు విముక్తి నాటిక, 13న సాయంత్రం కరీంనగర్ చైతన్యభారతి వారి స్వప్నం రాల్చిన అమృతం, అనంతరం గోవాడ క్రియేషన్స్ మూల్యం నాటిక, 14న సాయంత్రం 6 గంటలకు గుంటూరు వారి క్షేత్రం నాటిక ప్రదర్శిస్తారు. అనంతరం అల్లూరి విశిష్ట పురస్కారాన్ని శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత శ్యామ్‌కు అందించనున్నారు. తొలిరోజు కార్యక్రమాన్ని రాష్ట్ర సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్‌వీఆర్ బాపిరాజు, సహ కార్యదర్శి టీవీవీఎస్ఎన్ రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శి కె.పుల్లారావు, సభ్యులు మురళీ, కేవీ ప్రసాద్, సోమయాజులు పాల్గొన్నారు.

# కాకినాడలో కలకలం

- గాయాలతో కోర్టును ఆశ్రయించిన యువకుడు
- ప్రత్యర్థులు దాడి చేశారంటూ ఆరోపణ
- దాడి నిజం కాదన్న పోలీసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాయక్



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ప్రభుతేజ

**కాకినాడ క్రైం:** కాకినాడలో బుధవారం జరిగిన ఓ సంఘటన కలకలం రేపింది. ఓ యువకుడు నేరుగా రక్తపు గాయాలతో న్యాయమూర్తిని ఆశ్రయించాడు. పోలీసులపై నమ్మకం లేదంటూ నేరుగా కోర్టు గుమ్మం తొక్కాడు. నగరంలో అలజడి రేపిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ.. కాకినాడ రేచర్లపేట చినవీధి నూకాలమ్మ గుడి సమీపంలో కుంచె ప్రభుతేజ (24) తన తల్లితో కలసి నివాసం ఉంటున్నాడు. ఇతడు ఒక యూ ట్యూబర్. కొన్నేళ్లుగా ఈ యువకుడు ఉంటున్న ఇల్లు వివాదంలో ఉంది. దీనిపై 2018 నుంచి కోర్టులో కేసులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం తీవ్ర రక్తపు గాయాలతో ప్రభుతేజ ద్విచక్ర వాహనంపై కాకినాడ కోర్టుకు వెళ్లి తనపై ప్రత్యర్థులు హత్యాయత్నం చేశారని, స్థానిక పోలీసులపై నమ్మకం లేదని మీరే న్యాయం చేయాలంటూ న్యాయమూర్తిని కోరాడు. స్పందించిన న్యాయమూర్తి తక్షణమే పోలీసులకు ఆదేశాలిచ్చి కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. ఈ సందర్భంగా ఇచ్చిన వాంగ్మూలంలో బత్తిన రాజు, బత్తిన ఆకాష్, పుర్రె శ్రీను, పుర్రె భవాని, బొచ్చ దేవి, గొల్లపల్లి విక్కి, ఎద్దు సాగర్‌ల పేర్లు ప్రస్తావిస్తూ వారిలో ఇద్దరు తనను ఉదయం 11 గంటల సమయంలో తన ఇంటి ఆవరణలోకి లాక్కొచ్చి చాకుతో దాడి చేశారని, మిగిలిన వారు సహకరించారని పేర్కొన్నాడు. స్థానిక రెండో పట్టణ పోలీసులు వారికి వత్తాసు పాడుతున్నారని, గతంలో ఏనాడూ అక్కడ న్యాయం జరగలేదనే ఆవేదనతో నేరుగా కోర్టును ఆశ్రయించానని మీడియాకు వెల్లడించాడు.

**అంతా కట్టుకథ..**

విస్మయానికి గురిచేసిన ఈ ఘటనపై కాకినాడ టూ టౌన్ సీఐ నాగేశ్వర్ నాయక్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుతేజ వివాదాస్పద వ్యవహార శైలి కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు. అలాగే సుమారు రెండేళ్ల వ్యవధిలో ఏనాడు టూ టౌన్ పీఎస్‌ను ఆశ్రయించలేదని అన్నారు. బుధవారం నాటి ఘటనలో అతను చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. హత్యాయత్నం జరిగిందని పేర్కొంటున్న ఇంటి ఆవరణలో ఎక్కడా దాడి జరిగిన ఆధారాలు లేవని ప్రాథమిక విచారణలో వెల్లడైందని అన్నారు. కేవలం కట్టుకథ అని కొట్టి పడేశారు. ఇదే రీతిలో తన ప్రత్యర్థుల్ని భయానికి గురిచేసే క్రమంలో 2021లో తనకు తానే గాయాలు చేసుకొని, ఆసుపత్రిలో చేరాడని నాటి విచారణలో దాడి పూర్తి అవాస్తవమని తెలిసి క్రిమినల్ కేసు నమోదైందని వెల్లడించారు. అలాగే తన పాకను తానే కాల్చుకుని ప్రత్యర్థులపై ఆరోపణలు చేసి కేసు పెట్టాడని విచారణలో బయటపడిందని అన్నారు. అలాగే కలెక్టరేట్ ఎదుట కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంటానని బెదిరించిన ఘటనలో ప్రభుతేజపై కేసు నమోదైందన్నారు. బుధవారం తాను ముద్దాయిగా ఉన్న క్రిమినల్ కేసులో కోర్టు వాయిదాకు హాజరు కావాల్సి ఉండగా, ఇటువంటి నిర్వాకం చేశాడని అన్నారు. ప్రాథమిక విచారణ దశలో కుంచె ప్రభుతేజ ఆరోపిస్తున్నట్లు ఎటువంటి దాడి జరగలేదని, ఎలా గాయాలయ్యాయో తదుపరి విచారణలో తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. వీపు, కుడి చేయి, కుడి కాలు భాగాల్లో గాయాలయ్యాయన్నారు.